www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 26 డిసెంబరు 2023
5
పశ్చిమ గోదావరి

నేడు మైలా నాగయ్యవర్మ వర్థంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సిపిఎం నేత, అమరవీరుడు మైలా నాగయ్యవర్మ వర్థంతి మంగళవారం స్థానిక సుందరయ్య భవనం వద్ద నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. పాత భీమవరం తాలూకాలో నాగయ్యవర్మ వ్యవసాయ కార్మిక ఉద్యమంలో, భూపోరాటాల్లో సిపిఎం తాలుకా నేతగా ముఖ్యపాత్ర పోషించారని పేర్కొన్నారు. భూపోరాటం ఫలితంగా వందలాది పేద కుటుంబాలు వేలాది ఎకరాల బంజరు, అటవీ భూములు పొందాయని తెలిపారు. ఈ భూపోరాటంలో ఆధిపత్య కుల పెత్తందారులు, భూస్వాములు నాగయ్యవర్మను కిరాతకంగా హత్య చేశారని పేర్కొన్నారు. నాగయ్యవర్మ ప్రాణ బలిదానం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. భీమవరంతోపాటు తోకతిప్ప, కొత్తపూసలమర్రు గ్రామాల్లో కూడా నాగయ్యవర్మ వర్థంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ భీమవరం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ తెలిపారు.

జలుబు, గొంతునొప్పి, జ్వరం..!

పెరిగిన చలి తీవ్రత.. ఫ్యాన్ వేయాలంటేనే వణుకు

అనారోగ్య సమస్యలతో జనం తీవ్ర ఇబ్బందులు

కిటకిటలాడుతున్న ఆసుపత్రులు, మందుల దుకాణాలు

సాయంత్రం ఆరు తర్వాత బయట తిరగలేని పరిస్థితులు

మరోపక్క వెంటాడుతున్న కరోనా హెచ్చరికలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

శీతాకాలం చలిగాలులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. గడిచిన వారం రోజులుగా చలిపులి జిల్లా ప్రజానీకాన్ని వణికిస్తోంది. రెండు జిల్లాల్లోనూ రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. దీంతో పగలు, రాత్రుళ్లు సైతం ఫ్యాన్ వేయాలంటేనే వణికిపోతున్న పరిస్థితి ఉంది. వృద్ధులు, పిల్లలు మరింత ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత పెరగడంతో జనాన్ని అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. జలుబు, గొంతునొప్పి, జ్వరం, కఫం వంటి సమస్యలతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు జిల్లాల్లో ప్రతి కుటుంబంలోనూ ఒకరిద్దరు జలుబు, గొంతునొప్పి, జ్వరం వంటి సమస్యలతో బాధ పడుతున్నారు. రోజులు తరబడి అనారోగ్య సమస్యలు తగ్గడం లేదు. దీంతో ఆసుపత్రులు, మెడికల్ స్టోర్లు జనాలతో కిటకిటలాడుతున్నాయి. ఇదే అదునుగా ప్రయివేటు ఆసుపత్రుల్లో పరీక్షల పేరుతో రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు. సాదాసీదా జ్వరానికి కూడా రూ.నాలుగైదు వేలు పిండేస్తున్నారు. ఒకపక్క తీవ్రమైన చలి, మరోపక్క జలుబు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు సైతం జనాలతో నిండిపోతున్నాయి. వేడినీళ్లు తాగడం, ఆవిరి పట్టడం వంటివి చేస్తూ ఉపశమనం పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కరోనా వ్యాపిస్తుందనే ప్రచారం జనాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఏలూరు జిల్లాలో గడిచిన వారం రోజుల్లో ఒక కరోనా కేసు నమోదైంది. అయినప్పటికీ కరోనాపై జరుగుతున్న ప్రచారంతో జనంలో ఆందోళన నెలకొంది. జ్వరం, గొంతునొప్పి వంటి లక్షణాలు కరోనాకు దగ్గరగా ఉండటంతో అందరినీ భయం వెంటాడుతోంది. కరోనా కొత్త వేరియంట్‌తో ఇబ్బందిల లేదని, ఇది సాధారణంగా వచ్చి తగ్గిపోతుందని వైద్యాధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ జనాలను మాత్రం కరోనా భయం వీడటం లేదు. సాయంత్రం ఆరు తర్వాత చలికి బయట తిరగాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాలంటే చెవులకు, శరీరానికి చలిగాలులు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రాత్రిపూట ప్రయాణాలు మానుకోవాలని చెబుతున్నారు. వృద్ధులు, పిల్లలను మరింత జాగ్రత్తగా చూసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. చలిగాలుల ప్రభావం వృద్ధులు, పిల్లలపైనే ఎక్కువగా ఉంటుంది. ఇమ్యూనిటీ తక్కువగా ఉండటంతో త్వరగా వృద్ధులు, పిల్లలను అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయని వైద్యులు చెబుతున్నారు. ఆహారం కూడా వేడిగా తినాలని సూచిస్తున్నారు. కూల్‌డ్రింక్స్ వంటి శీతలపానీయాల జోలికిపోకూడదని చెబుతున్నారు. జలుబు, గొంతునొప్పి వంటి సమస్యలు చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు సర్వసాధారణమని, కంగారు పడాల్సిన పనిలేదని అంటున్నారు. నాలుగైదు రోజులపాటు తగిన జాగ్రత్తలు తీసుకుని, మందులు వాడితే తగ్గిపోతుందని, ఆందోళన చెందవద్దని సూచిస్తున్నారు. తుపాను ప్రభావంతో ఖరీఫ్ మాసూళ్లు పూర్తికాకపోవడం, దాళ్వా సాగుకు నారుమడులు వేయాల్సి రావడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉదయం పొలం వెళ్లే వ్యవసాయ కూలీలు చలిగాలులకు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా అనారోగ్యం బారిన పడుతున్నారు. చలిగాలులతో వెంటాడే అనారోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యఆరోగ్యశాఖ ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. అప్పుడే ప్రయివేటు ఆసుపత్రుల్లో జరిగే దోపిడీకి అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

నాణ్యమైన వంటకాలు అందించాలి

అనురాగ్ ఫుడ్స్ ప్రారంభంలో పత్సమట్ల ధర్మరాజు

ప్రజాశక్తి - గణపవరం

నాణ్యమైన వంటకాలు వినియోగదారులకు అందించి వారి నమ్మకాన్ని పొంది వ్యాపారం అభివృద్ధి చేసుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం గణపవరం శివారు గాంధీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అనురాగ్ క్షత్రియ ఫుడ్స్ హోటల్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో హోటల్ యజమాని పేరిచర్ల కిరణ్‌రాజు (చింతపల్లి రాజు), జనసేన నాయకులు తోట శ్రీను, తోట పవన్, తానేటి జోగేశ్వరరావు, లంకా రాంబాబు పాల్గొన్నారు.

హోటల్‌ను ప్రారంభిస్తున్న ధర్మరాజు

నిలువెల్లా నిర్లక్ష్యం..!

శిథిలావస్థలో లాకులు, షట్టర్లు - మరమ్మతులపై సర్కారు మొద్దునిద్ర - ప్రతియేటా రైతులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - కాళ్ల

డెల్టాలోని కాలువల దుస్థితి చూస్తే రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఏపాటిదో స్పష్టమవుతోంది. ఒక మహోన్నత లక్ష్యంతో నాడు సర్ ఆర్థర్ కాటన్ గోదావరిపై ఆనకట్ట నిర్మించి గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేస్తే నేటి ప్రభుత్వాలు వాటి అభివృద్ధి మాట అటుంచి కనీస వాటి పరిరక్షణను సైతం చేపట్టలేని దుస్థితిలో ఉన్నాయి.

పంట పొలాల సాగుకు నీరందించే కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంతో ప్రతియేటా అన్నదాతకు అవస్థలు తప్పడం లేదు. దీనికి నిదర్శనం మండలంలోని ఏలూరుపాడు లాకులే నిదర్శనం.

శిథిలావస్థలో లాకుల షట్టర్లు

డెల్టాలో సాగునీటి కాలువల వ్యవస్థలో కీలకమైన లాకులు, వియ్యర్లు, రెగ్యులేటర్లు దాదాపు 160 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ కట్టడాల నిర్వహణపై దశాబ్దాలుగా నిర్లక్ష్యం కొనసాగుతోంది. ప్రభుత్వాలు ప్రకటనలు గుప్పిస్తున్నా కార్యాచరణ కానరాకపోవడంతో క్షేత్రస్థాయిలో ఆయా కట్టడాల పరిస్థితి ప్రమాదకరంగా మారింది. డెల్టాలో ప్రధాన పంట కాలువలపై 25 లాకుల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. వీటిలో నరసాపురం, జిఅండ్‌వి కాలువలపై ఆరేసి చొప్పున లాకులు, విఎండబ్ల్యూ, బ్యాంక్ కెనాల్ కాలువలపై మూడేసి లాకులు, ఉండి, అత్తిలి, కాకరపర్రు కాలువలపై రెండేసి లాకులు, జంక్షన్ కాలువపై ఒక లాకు ఉన్నాయి. ఎక్కువ శాతం లాకుల తలుపులు దెబ్బతిని నీరు వృథాగా పోతుంది. అత్యవసర వేళల్లో నీటిని డ్రెయిన్లలోకి మళ్లించే ప్రాంతాల్లో ఉన్న వియ్యర్, షట్టర్లు పలుచోట్ల దెబ్బతిన్నాయి. 25 లాకుల కట్టడాల్లో సగానికిపైగా ప్రమాదకర స్థితికి చేరాయి. పశ్చిమ డెల్టాలో సుమారు ఏడు కాలవల నుంచి విడిపోయే 80 పిల్ల కాలవలపై స్లూయిస్‌లు, షట్టర్లు దెబ్బతిన్నాయి. వెంకయ్యవయ్యేరు కాలవలో పరిమెళ్ల లాకు, చినకాపవరం, ఏలూరుపాడు లాకులు శిథిలావస్థకు చేరాయి. ఉండి కాలవపై చిలకంపాడు, యండగండి లాకులు దెబ్బతిన్నాయి.

శిథిలావస్థలో ఏలూరుపాడు లాకులు

డెల్టాలో పరిమెళ్ల లాకు నుంచి ప్రారంభమైన వెంకయ్యవయ్యేరు వంటకాలువ ఏలూరుపాడు లాకుల వద్ద ముగుస్తుంది. ఏలూరుపాడు లాకుల నుంచి ఉప్పుటేరులో కలుస్తోంది. ఒకప్పుడు ఈ లాకుల మార్గం నుంచే జలరవాణా జరిగేది. మచిలీపట్నం వెళ్లేందుకు ఈ మార్గాన్ని ఉపయోగించేవారు. ప్రస్తుతం లాకులు, వియర్స్ శిథిలావస్థకు చేరాయి. నిడమర్రు, గణపవరం, ఆకివీడు, కాళ్ల మండలాల్లోని 40 వేల ఎకరాల ఆయకట్టుకు వెంకయ్యవయ్యేరు నీరే ప్రధానం. సుమారు వంద గ్రామాలకు సాగు, తాగు నీరందించే పంట కాలువ ఇదే. ఈ కాల్వకు దిగువన ఏలూరుపాడు లాకులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. నీరు అవసరమున్నప్పుడు లాకును కట్టి వివిధ ఛానల్స్‌కు మళ్లించి సాగు అవసరాలు తీర్చుతున్నారు. ప్రజలకు తాగునీటిని అందిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన లాకు, వియ్యర్‌లను పట్టించుకునే నాథుడే లేడు. సాగునీటి పారుదలకు అనధికార తూరలు పెద్ద అవరోధంగా మారాయి. ఆక్వా సాగుకు అనుకుని ఉన్న వరి చేలకు సాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కాళ్ల మండలం ఆక్వాజోన్ పరిధిలో ఉండడంతో అనధికార తూరలు ఏర్పాటు చేశారు. అనధికార తూరలు వేల సంఖ్యలో ఉన్నాయి. నీటిపారుదల, రెవెన్యూ అధికారులు వీటిపై దృష్టి పెట్టడం లేదని రైతులు, కౌలురైతులు వాపోతున్నారు. దీంతో శివార్లలో ఉన్న ఆయకట్టు భూములకు సాగునీరు సక్రమంగా అందని పరిస్థితి ఉంది. దీంతో ఏలూరుపాడు లాకుల మరమ్మతులు కోసం రైతులు కళ్లుకాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు.

ఏలూరుపాడు లాకులు శిథిలావస్థకు చేరడంతో వృథాగా పోతున్న నీరు

ఏలూరుపాడు లాకులకు మరమ్మతులు చేపట్టాలి

ఎన్.నాగార్జున, ఏలూరుపాడు

సాగు, తాగునీటిని అందించే వెంకయ్య వయ్యేరు కాలువ నీరే ఈ ప్రాంత ప్రజలకు ప్రధాన ఆధారం. ఏలూరుపాడు లాకులు శిథిలావస్థకు చేరాయి. లాకుల షట్టర్లు దెబ్బతినడంతో నీరు వధాగా పోతుంది. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు, వరి, ఆక్వా రైతులకు సాగునీటి కష్టాలు లేకుండా లాకుల మరమ్మతులు తక్షణం చేపట్టాలి.

పండుగ పూట సమ్మెలోనే..

14వ రోజుకు అంగన్వాడీల సమ్మె - జగన్ మనస్సు మార్చాలంటూ ప్రార్థనలు - అంగన్వాడీ లబ్ధిదారులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీలు

క్రిస్మస్ పండుగ నాడు అంగన్వాడీలు జిల్లాలో సోమవారం 14వ రోజు సమ్మె కొనసాగించారు. సమ్మె శిబిరాల్లో కేక్‌లు కట్ చేసి తమ సమస్యలు పరిష్కరించేలా సిఎం జగన్ మనస్సు మార్చాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా అంగన్వాడీ కేంద్రాల పరిధిలో అంగన్వాడీల లబ్ధిదారులు, చిన్నారులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు.

భీమవరం రూరల్‌లో..

ప్రజాశక్తి - గణపవరం

ముఖ్యమంత్రి జగన్ మనస్సును మార్చి తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు స్థానిక దళితవాడలో కేక్ కట్ చేసి ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి ఎమ్‌డి.హసీనాబేగం మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని 14 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం మొద్దునిద్రలో ఉందన్నారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేతలు బి.రామకోటి, ధనలక్ష్మి, కెవి.మహాలక్ష్మి, కళ్యాణి, జె.జయలక్ష్మి, సిహెచ్.మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఉండిలో..

ఆచంట (పెనుమంట్ర): తమ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. మార్టేరు, నెగ్గిపూడి, వెలగలేరు, పెనుమంట్ర, మాముడూరు, జుత్తిగ తదితర గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల తల్లులతో కలిసి నిరసన తెలిపారు.

కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాస ప్రసాద్, అంగన్వాడీ సెక్టార్ లీడర్లు సరస్వతి, మౌనిక, సాయి మహాలక్ష్మితోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

యలమంచిలి: అంగన్వాడీల సమ్మె సోమవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా మండలంలో అంగన్వాడీలు ఎక్కడికక్కడ కొవ్వొత్తుల ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అంగన్వాడీ నాయకులు రజని, దేవి, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఉండి: తమ సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి జగన్ సానుకూలంగా స్పందించేలా చూడాలంటూ క్రిస్మస్ సందర్భంగా అంగన్వాడీలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహింఆచరు. అనంతరం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయం వద్ద కొవ్వొత్తులు చేతబూని నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, సిఐటియు మండల అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెనుగొండ: తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు సోమవారం లబ్ధిదారులతో కలిసి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. సిద్ధాంతం, రామన్నపాలెం, చెరుకువాడ, రాజుగూడెం, మారమ్మగూడెం, చిన్నవారిపాలెం, ఇలపర్రు తదితర గ్రామాల్లో అంగన్వాడీలు లబ్ధిదారులు, చిన్నారులతో కలిసి నిరసన తెలిపినట్లు సిఐటియు మండల కార్యదర్శి కానూరి తులసి తెలిపారు.

భీమవరం రూరల్: పండుగ రోజు సైతం అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. మంగళవారం గ్రామాలు, పట్టణంలో అంగన్వాడీ లబ్ధిదారులతో కలిసి కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించి నిరసన తెలిపారు. ప్రభుత్వం చర్చలకు పిలిచి ఇప్పటికైనా అంగన్వాడీ డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.

మొగల్తూరు: చిన్నారులు, బాలింతలకు ప్రభుత్వం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని అంగన్వాడీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు సమ్మెలో భాగంగా 14వ రోజు సోమవారం గ్రామాల్లోని చిన్నారుల తల్లిదండ్రులను కలిసి తమ డిమాండ్లు, సమస్యలు వివరించారు. దీంతో అంగన్వాడీల సమ్మెకు తల్లిదండ్రులు మద్దతు పలికి ఆయా గ్రామాల్లో చేపట్టిన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్వాడీలు పెద్దింట్లు, సారమ్మ, సీత, నాగలక్ష్మి, రేఖ శాంభవి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోడూరు: అంగన్వాడీలు సమ్మెలో భాగంగా క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేశారు. ప్రభుత్వం తమ పట్ల సానుకూలంగా స్పందించాలని కోరుతూ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం లబ్ధిదారులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నేతలు పీతల రాజమణి, జి.వనజ, పి.విస్తారి, ఎం.అమ్మాజీ, కె.అరుణ, కె.ప్రభావతి, పి.ప్రసన్నకుమారి, ఎం.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో..

మాట్లాడుతున్న గోపీమూర్తి

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన వివిధ ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఆర్‌సి, డిఎ, మెడికల్ రీయంబర్స్‌మెంట్, ఎపి జిఎల్‌ఐ, పిఎఫ్, సరెండర్ లీవ్ బకాయిలు రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.18 వేల కోట్లు ఉన్నాయని, వీటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. గతంలో ప్రభుత్వంతో జరిగిన సమావేశంలో సెప్టెంబర్‌లో అన్ని బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ డిసెంబర్ గడుస్తున్నా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతున్నట్లు తెలిపారు. ఈ నెల 27వ తేదీ బుధవారం సాయంత్రం ఐదు గంటల నుండి రాత్రి 11 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాత తాలూకా కేంద్రాల్లో ఆరు గంటల నిరసన కార్యక్రమాలు జరపాలని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని ఆయన వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని గోపీమూర్తి హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి బకాయిలు విడుదల చేయకుంటే జనవరి 3న జిల్లా కేంద్రాల్లో 12 గంటల ధర్నా, జనవరి 9, 10వ తేదీల్లో విజయవాడలో 36 గంటల ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. యుటిఎఫ్ దశలవారీ పోరాటంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, కోశాధికారి సిహెచ్.పట్టాభి రామయ్య, జిల్లా కార్యదర్శులు పి.క్రాంతికుమార్, జి.రామకృష్ణంరాజు, డి.ఏసుబాబు, సిహెచ్.కుమార్, బాబ్జి, రాష్ట్ర కౌన్సిలర్ బిజెవిడి.రాజ్యలక్ష్మి, నేతలు కె.త్రిమూర్తులు, బి.నాగబాబు, ఎస్ గోవింద్, పి వీరబాబు, జి.రవివర్మ పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని వద్దంటున్న జనం

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

దగా, మోసం, వంచన చేసిన జగన్ ప్రభుత్వాన్ని అన్ని తరగతుల ప్రజలు వద్దంటున్నారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు ఒకటో వార్డులో సోమవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి, జనసేన నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగారు. టిడిపి, జనసేన కూటమితో ప్రతి కుటుంబంలో కలిగే లబ్ధిని వివరిస్తూ వివరాలు నమోదు చేసి బాండులను అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల మాట్లాడుతూ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమానికి ప్రజలు, మహిళలు, పేదల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ

30, 31 తేదీల్లో భీమవరం బాలోత్సవం

భీమవరం రూరల్ :ఈ నెల 30, 31 తేదీల్లో జరిగే బాలోత్సవాన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి కోరారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో భీమవరం బాలోత్సవం కమిటీ సమావేశం ఆ కమిటీ అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో గోపీమూర్తి మాట్లాడుతూ పిల్లల్లోని సృజనాత్మకత వెలికితీతకు బాలోత్సవం ఉపయోగపడుతుందన్నారు. వివిధ ప్రజాసంఘాలు, రిటైర్డ్ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. భీమవరం చుట్టుపక్కల ఆరు మండలాలు స్కూల్స్ పిల్లలు ఈ బాలోత్సవంలో పాల్గొంటారన్నారు. సమావేశంలో భీమవరం బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య, కల్చరల్ విభాగం కన్వీనర్ చైతన్యప్రసాద్, కోశాధికారి పి.సీతారామరాజు, అసోసియేట్ కార్యదర్శి జి.ధనుష్, వివిధ సంఘాల నాయకులు, ఎస్.సత్యనారాయణరాజు, చింతపల్లి ప్రసాదరావు, మల్లుల శ్రీనివాస్, ఆర్.వెంకన్నబాబు, ఎస్.శిరీష్‌కుమార్, పిఎస్.విజయరామరాజు, కుమారబాబ్జి, రామకృష్ణంరాజు, ఏసుబాబు, కె.అశోక్, మురళీధర్, రవికుమార్‌రాజు, నాగబాబు, సూర్యనారాయణ, వేణుగోపాల్, గోవింద్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా'

ప్రజాశక్తి - గణపవరం

గణపవరంలో మంగళవారం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా నిర్వహించనున్న ఆటల పోటీలను ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ప్రారంభించనున్నట్లు గణపవరం పంచాయతీ కార్యదర్శి డి.ఎస్.ఆర్.ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆటల పోటీలు ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ పోటీలు స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల హైస్కూల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న క్రీడాకారులకు వాలంటీర్ల ద్వారా మెసేజ్ ద్వారా తెలియజేసినట్లు తెలిపారు.

మొగల్తూరు : మొగల్తూరులోని పెనుమత్స రంగరాజు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు మంగళవారం ప్రారంభించనున్నారని ఆయన కార్యాలయ సిబ్బంది తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆయా శాఖల అధికారులు, క్రీడాకారులు హాజరు కావాలని సూచించారు.

మహోన్నత వ్యక్తి వాజ్‌పేయి

ప్రజాశక్తి - పాలకొల్లు

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకులు రావూరి సుధ వాజ్‌పేయి చిత్రపటానికి పాలకొల్లులో పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ జాతీయ రహదారుల నిర్మాణానికి నాంది పలికిన ఘనత వాజ్‌పేయిదే దక్కుతుందన్నారు. తన పాలనలో అవినీతి తావు లేకుండా నిరాడంబర జీవితం గడిపిన మహోన్నత వ్యక్తి వాజ్‌పేయి అన్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్, వేరకొండ దుర్గాప్రసాద్, చేగొండి బాబీ, పడవల ఉమా, గణేష్, సుధీర్, బాలు, పగడాల మోహనరావు పాల్గొన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

క్షతగాత్రులను ఆసుపత్రిలో చేర్పించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

నెగ్గిపూడి లాకుల వద్ద సోమవారం ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. అటుగా వస్తున్న ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు 108కు సమాచారం మేరకు సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన ప్రయివేటు ఎలక్ట్రీషియన్ పెనుగొండ వైపు బైక్‌పై వెళ్తుండగా అదే సమయంలో ఎదురుగా బైక్‌పై వస్తున్న పిప్పరకు చెందిన మరొకవ్యక్తి ఢీకొన్నారు. అదే సమయంలో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు కారు ఆపి గాయాలపాలైన ఇద్దరిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని హాస్పటల్ వైద్యాధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ మేరకు ఎంఎల్ఎ మానవత్వాన్ని చాటుకున్నారు.

నేడు మారియ్య వర్ధంతి సభ

ప్రజాశక్తి - వీరవాసరం

కల్లుగీత కార్మిక ఉద్యమ నాయకుడు జుత్తిగ మారియ్య 17వ వర్ధంతిని ఈ నెల 26న బుధవారం చెరువు వద్ద గల మారియ్య స్మారక స్థూపం వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు భీమవరం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు చింతపల్లి వీరస్వామి, కడలి పాండులు సోమవారం తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా మాజీ ఎంఎల్‌సి దిగుపాటి రాజగోపాల్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మికులందరూ పాల్గొనాలని వారు కోరారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

3 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జనవరి 3 నుంచి 8వ తేదీ వరకూ త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ (త్యాగరాజ భక్త సభ) ఆధ్వర్యంలో 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు, త్యాగరాజ వర్థంతిని నిర్వహిస్తున్నట్లు మ్యూజిక్ అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, కారుమూరి ఆదిత్య తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో బ్రోచర్‌ను విడుదల చేసి మాట్లాడారు. జనవరి 3 నుంచి 6వ తేదీ వరకూ సాయంత్రం 6.30 గంటల నుంచి ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం, 7, 8 తేదీల్లో ఎఎస్ఆర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యక్షులు గన్నాబత్తుల శ్రీనివాస్, సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి మాట్లాడుతూ 3న ఉదయం 8.30 గంటలకు స్వామివారి ఊరేగింపు, సాయంత్రం 6.30 నిమిషాలకు సురేంద్రనాథ్ అండ్ పార్టీ 24 మంది బృందంతో నృత్యం, 4న యోగావందనచే వీణ కచేరి, 5న లతాంగి సిస్టర్స్‌చే గాత్రం, 6న ఉదయం 10 గంటలకు శ్రీత్యాగరాజ స్వామివారి పంచరత్న కీర్తనలు, సాయంత్రం 6.30 గంటలకు బెంగళూరు బ్రదర్స్ వారిచే గాత్రం, 7న జంధ్యాల కష్ణకుమారి బందంచే హరికథ జరగనుందని తెలిపారు. 8న పోపూరి గౌరీనాథ్ బృందం వారిచే పాహిరామ ప్రభో సంగీత రూపకం నిర్వహిస్తున్నామని తెలిపారు. అందరూ పాల్గొని ఆరాధనోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, కారుమూరి బాబు పాల్గొన్నారు.

బరిలో తలపడుతున్న జట్లు

అంగజాలపాలెంలో చెడుగుడు పోటీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం నార్త్ పంచాయతీ పరిధి అంగజాలపాలెంలో అంతర్ జిల్లాల చెడుగుడు పోటీలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని గ్రామంలోని రామాలయం వద్ద చెడుగుడు పోటీలు నిర్వహించారు. సోమవారం జరిగిన పోటీల్లో పాలకొల్లు జట్టుపై భీమవరం జట్టు ఈగల్ బాయ్స్ విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 27వ తేదీ వరకూ పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మా కష్టాలు కనపడవా..!

నిత్యం పడవలపైనే లంకవాసుల ప్రయాణం
వరదలొస్తే అంతే సంగతి
బిక్కుబిక్కుమంటూ జీవనం
అడుగు ముందుకు పడని వంతెన నిర్మాణ హామీ
అయోధ్యలంక వాసుల ఆవేదన

ఈ పడవల్లోనే అయోధ్యలంక వాసుల ప్రయాణం

బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రారంభించిన శిలాఫలకం(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ఠ గోదావరి గీసిన నెలవంక అయోధ్యలంక గ్రామం. ఆ ఊరును గోదావరి నిర్మించింది. వరదలొచ్చినప్పుడు ఊళ్లు, ఏరులు ఏకం చేసే ఉగ్రగోదావరి ఆ ఊరికి మాత్రం ఒక సమగ్ర రూపం ఇచ్చింది. వందల ఏళ్ల క్రితం సహజ సిద్ధంగా ఒక దీవిని నిర్మించింది. దాన్ని నివాసయోగ్యంగా మార్చుకున్నారు స్థానికులు. వరదలకు ఎగువ నుంచి కొట్టుకొచ్చిన ఇసుకతో గోదావరి మధ్యలో పెద్ద పెద్ద మేటలు ఏర్పడతాయి. అవి ఒక్కోసారి కిలోమీటర్ల మేర విస్తరిస్తాయి. ఈ విధంగా గోదావరి మధ్యలో ఏర్పడిన గ్రామమే అయోధ్య లంక. ఆ గ్రామానికి చేరుకోవాలంటే పడవ ఎక్కాల్సిందే. పచ్చని పంట పొలాలు, పశు సంపద, గలగల పారే గోదావరి, ఇసుక తెన్నెలు చూడచక్కని అందాలు అయోధ్యలంక సొంతం. ప్రభుత్వాలు దృష్టి సారిస్తే ఈ గ్రామం ఒక పర్యాటక కేంద్రం అయ్యేది. సహజంగానే బాహ్య ప్రపంచంతో సంబంధాలు అంతగా ఉండని ఈ లంక గ్రామాన్ని అభివృద్ధి పరంగా పట్టించుకోకపోవడంతో అక్కడివారు ఒంటరితనం అనుభవిస్తున్నారు.

దినదిన గండం పడవ ప్రయాణం..

గోదావరి జిల్లాలో ఎక్కడ పడవ ప్రమాదం జరిగినా ఆచంట నియోజకవర్గంలోని లంకగ్రామాల వాసుల గుండెల్లో రైళ్లు పరిగెడుతుంటాయి. నియోజకవర్గంలో అనేక లంక గ్రామాలున్నాయి. శతాబ్దాల క్రితం గోదావరి పాయల మధ్య సహజ సిద్ధంగా ఏర్పడిన దీవులను ఇక్కడివారు నివాస ప్రాంతాలుగా మార్చుకున్నారు. ఆచంట మండలం పెదమల్లం పంచాయతీ పరిధిలో ఆనగార్లలంక, కోడేరు పంచాయతీ పరిధిలో పల్లెపాలెం, అయోధ్యలంక పంచాయతీ పరిధిలో అయోధ్యలంకతోపాటు పుచ్చలంక, మర్రిమూల, రాయిలంక, గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో దాదాపుగా ఏడు వేల మంది ప్రజలు జీవిస్తున్నారు. వారు నిత్యం గోదావరిలో పడవలపై ప్రయాణిస్తుంటారు. గోదావరికి వరదలొచ్చినా వారు లంక గ్రామాలను వదిలి బాహ్య ప్రపంచంలోకి రాని పరిస్థితి. ఎందుకంటే లంకగ్రామాలతో వారికున్న అనుబంధం అటువంటిది. ప్రమాదమని తెలిసినా పడవ ప్రయాణమే వారికి ఆధారం. దీంతో బిక్కుబిక్కుమంటూనే వారు నిత్యం పడవలపై ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలో వారు ఒక్కోసారి పడవ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు.

తూర్పుగోదావరితోనే అనుబంధం..

మండలంలోని లంక గ్రామాలు భౌగోళికంగా జిల్లాలో ఉన్నా వారికి తూర్పుగోదావరి జిల్లాతోనే అనుబంధం ఎక్కువ. ముఖ్యంగా ఆనగార్లలంక, పుచ్చలంక, పల్లెపాలెం వాసులకు తూర్పుగోదావరికి చేర్చి ఒకవైపు రోడ్డు సౌకర్యాలు ఉన్నాయి. దీంతో వారు తహశీల్దార్, గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనులకు మాత్రమే పశ్చిమ వైపు వస్తుంటారు. నిత్యావసరాలను తూర్పుగోదావరి జిల్లా నుంచి తెచ్చుకుంటారు. నిత్యం గోదావరిలో రాకపోకలు తప్పనిసరి. దీనికి వారు నాటు పడవలనే వినియోగిస్తున్నారు.

అయోధ్యలంక వాసులది అత్యంత దైన్యం..

అయోధ్యలంక గ్రామం పూర్తిగా గోదావరి మధ్యలో ఉంటుంది. ఆ ఊరు వెళ్లి రావాలంటే పడవ ప్రయాణమే దిక్కు. ప్రతి చిన్న పనికీ వారు పడవ ఎక్కాల్సిందే. అయోధ్యలంకలోనే సుమారు నాలుగు వేల మంది జనాభా ఉన్నారు. వీరు పేరుకు పశ్చిమగోదావరిలో ఉన్నా వారికి నిత్యం తూర్పుగోదావరితోనే అనుబంధం ఎక్కువ. విద్య, వైద్యం, వ్యాపారం తదితర అవసరాల కోసం వారు తూర్పుగోదావరి వెళ్లి వస్తుంటారు. ఎందుకంటే వీరికి పశ్చిమ కంటే తూర్పు తీరం దగ్గర. చిన్నపాటి పాయదాటి పుచ్చలంక వెళ్తే అక్కడ నుంచి తూర్పుగోదావరి చేరుకోవడం వారికి క్షణాల్లో పని. లంకలో పండించిన కొబ్బరి, అరటి, మొక్కజొన్న, పచ్చిమిర్చి, తమలపాకు, కూరగాయలు, అపరాలు మార్కెట్‌కు వెళ్లాలంటే పడవ ద్వారానే తూర్పుగోదావరి చేరుకోవాల్సిందే. అంతేకాదు లంక గ్రామాల్లో ఇంటి నిర్మాణం ఒక పెద్ద ప్రహసనమే. నిర్మాణ సామగ్రి పడవలపైనే చేర్చుకోవాలి. లంక గ్రామంలో ప్రాథమిక విద్య వరకూ అందుబాటులో ఉండటంతో ఉన్నత విద్య కోసం నిత్యం విద్యార్థులు పడవల మీదే తూర్పుగోదావరి జిల్లాకు వెళ్లి వస్తుంటారు.

కలగానే వంతెన నిర్మాణం..

అయోధ్యలంక అభివృద్ధి అంతా వంతెనతో ముడిపడి ఉండడంతో అయోధ్యలంక, పుచ్చలంక గ్రామాల మధ్య వంతెన నిర్మించాలని ఎప్పటి నుంచో లంకవాసులు డిమాండ్ చేస్తున్నారు. అయితే 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు వశిష్ఠ గోదావరిపై అయోధ్యలంక - పుచ్చలంక గ్రామాలను కలుపుతూ రూ.50 కోట్లతో వారధి నిర్మిస్తామని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ హామీ ఇచ్చారు. హడావుడిగా వంతెనకు శంకుస్థాపన కూడా చేశారు. 2019లో సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఓటమి పాలైంది. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఈ క్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రిగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో జిల్లాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అనగార్లంక, అయోధ్యలంక బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి వారధి సమస్యను తీసుకెళ్లడంతో పాటు ఆయా ప్రాంతాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు. ఈ నేపథ్యంలో తక్షణ నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలంటూ సానుకూలంగా స్పందించారని శ్రీరంగనాథరాజు తెలిపారు. ఈ నేపథ్యంలో గత ఆగస్టులో వచ్చిన వరదలకు అయోధ్యలంక వెళ్లిన శ్రీరంగనాథరాజును అక్కడి ప్రజలు గోదావరిపై వారధి నిర్మించాలని నిలదీయగా సుమారు రూ.100 కోట్లు ఖర్చవుతుందంటూ మాట దాటవేశారు. వరదలొచ్చిన ప్రతిసారీ ప్రజా ప్రతినిధులు హామీలివ్వడం తప్ప అమలు చేయకపోవడంతో వంతెన నిర్మిస్తారన్న ఆశలు వారిలో సన్నగిల్లుతున్నాయి.

వంతెన నిర్మిస్తే గాని మా బాధలు తీరవు..

చొప్పల నాగేశ్వరరావు, అయోధ్యలంక

లంకగ్రామాల్లో బాధలు పడలేక మా పిల్లలు ఇక్కడి నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇక్కడే పుట్టిన మేం బయటకు రాలేకపోతున్నాం. గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గ్రామానికి వంతెన పడితే గాని మా బాధలు తీరవు. తక్షణం పాలకులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించండి.

బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నాం..

సరేళ్ల వెంకటేశ్వరరావు, అయోధ్యలంక

అయోధ్యలంకకు వంతెన నిర్మిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత వంతెన ప్రస్తావనే లేదు. వరదల సమయంలో ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజును నిలదీయగా రూ.వంద కోట్లు ఖర్చవుతుందంటూ మాట దాటేసి వెళ్లిపోయారు. బిక్కుబిక్కుమంటూ పడవలపై వెళ్తున్నాం. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలి.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



మొగల్తూరు : మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - ఆచంట

క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట క్రీస్తు ప్రార్థనా మందిరంలో గాదిరాజు తిమోతిరాజు అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథరాజు మాట్లాడుతూ క్రీస్తు బోధనలను అనుసరించడం ద్వారా సమాజంలో శాంతి సామరస్యం ఏర్పడుతుందన్నారు. అనంతరం చిన్నారులతో క్రిస్మస్ కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకులు ఆశీర్వాదం ఆలపించిన క్రైస్తవ పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజును, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మట్టా ఆనంద్‌కుమార్, కారుమిల్లి వెంకటేశ్వరరావు, ఉషారాణి, కుమారి పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : ఆలమూరు ఫెయిత్ హోమ్ చర్చిలో పాస్టర్ కొమ్మర డేవిడ్ రాజు, విజయ కుమారి హ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మేడపాటి వెంకటరమణ, త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఆచంటలో కేక్‌కట్ చేస్తున్న ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు

కాళ్ల: క్రీస్తు మార్గం అనుసరణీయమని కలవపూడి గ్రామ సర్పంచి గేదెల జాన్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా పలు చర్చిలు విద్యుత్ కాంతులతో కళకళలాడాయి. ఈ సందర్భంగా క్రైస్తవసోదరులు చర్చిల్లో ప్రార్ధనలు చేశారు. మండలంలో ఏలూరుపాడు, జువ్వలపాలెం, కలవపూడి, కాళ్లకూరు, దొడ్డనపూడి, కాళ్ల, వేంపాడు, పెదఅమిరం, కోపల్లె, మామిడిపూడి, జక్కరం గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

పాలకొల్లు : క్రిస్మస్ సందర్భంగా పాలకొల్లు అంజలి మానసిక వికలాంగుల పాఠశాలలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపీ పాల్గొని పిల్లల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఇలా పిల్లలతో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆయన వెంట మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ యడ్ల తాతాజీ, పెచ్చేటి కృష్ణాజీ, భుజంగరావు, చెన్ను విజయ్, మండేలా బుజ్జి, పాలపర్తి కృపానందం పాల్గొన్నారు.

పాలకొల్లులో క్రిస్మస్ వేడుకలు

మొగల్తూరు : ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాద్‌రాజు అన్నారు. మండలంలోని పాతపాడులో ప్రార్థనా మందిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముందుగా క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాలపర్తివారిపేటలోని ప్యారిస్ చర్చి ఆవరణలో ఫాదర్ గోడి యేసుబ్‌రాజు, కొండావారిపాలెంలోని పారిస్-2 లూథరన్ చర్చిలో రెవరెండ్ ఫాదర్' టి.కొండయ్య మార్టిన్ మోజెష్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పాలకొల్లు : పట్టణంలోని పలు క్రీస్తు ఆలయాలు కళకళలాడుతున్నాయి. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ సోదరులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బెత్లెహాంపేట, శంభునిపేట, క్రిష్టియన్‌పేట, మార్కొపేట చర్చిలు సందడిగా ఉన్నాయి. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నేతలు చర్చిల వద్దకు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఉండి : మండలంలోని అన్ని గ్రామాల్లో చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉండి సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో పాస్టర్ ప్రసన్న కుమార్ మాట్లాడారు. అనంతరం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఈ వేడుకలలో చర్చి సెక్రటరీ చిట్టూరి రత్న రజు, సంఘం సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

ఉండి బరిలో నిలిచేదెవరో..?

ప్రజాశక్తి - ఉండి

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఉండి నియోజకవర్గం నుంచి బరిలో నిలిచేది ఎవరో అని ప్రజలంతా సర్వత్రా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 18 నెలల నుంచి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్ నరసింహరాజు నియోజకవర్గంలోని సుమారు 60 గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నారు. కరోనా సమయంలో సైతం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలు చేపడుతూ రెడ్‌జోన్ ప్రాంతంలో ఉన్న వారికి అవసరమైన నిత్యావసర సరుకులు అందజేశారు.

దీనికి భిన్నంగా టిడిపి ప్రజాప్రతినిధులు గత రెండేళ్లలో బాదుడే బాదుడు, ఇదేం కర్మ, మహాశక్తి, బాబుతో నేను, ఇంటింటికీ టిడిపి కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లినప్పటికీ ప్రజా సమస్యలను పూర్తి స్థాయిలో తెలుసుకోలేకపోయారు. కరోనా సమయంలో ప్రజలకు అందుబాటులో లేకుండా ఎంఎల్ఎ మంతెన రామరాజు తన వ్యాపార లావాదేవీలకు మాత్రమే ప్రాముఖ్యతనిస్తూ బాధితులకు అండగా నిలవలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గుడ్డిలో మెల్ల అన్న చందంగా ఆనందయ్య మందు సొంతంగా తయారుచేసి నియోజకవర్గ ప్రజలకు అందించారు.

జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా జుత్తిగ నాగరాజును అధిష్టానం ఇటీవలే ప్రకటించగా ఆయన పార్టీలో చేరినప్పటి నుంచి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ జనంలోకి ప్రజల్లోకి వెళ్లే ఏర్పాట్లు చేసుకున్నారు. అధిష్టానం ఇన్‌ఛార్జి పదవి అప్పగించడంలో జాప్యం చేయడంతో జనంలోకి జనసేన కార్యక్రమానికి మధ్యలో కొంత విరామం ఇచ్చారు. గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారనే అపవాదు నాగరాజుకు ఉంది. గత నెలలో ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించినప్పటి నుంచి తిరిగి జనంలోకి జనసేన కార్యక్రమాన్ని కొనసాగించారు. వారిలో పివిఎల్ నరసింహరాజు మాత్రమే ప్రతి గడపకూ వెళ్లి అందుతున్న సంక్షేమ పథకాలు, సమస్యల గురించి తెలుసుకోవడమే కాకుండా గ్రూపు రాజకీయాలకు తావివ్వకుండా చేసుకోవడంలో విజయం సాధించారని చెప్పొచ్చు. తనకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందించే సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు విజయానికి సోపానాలని ఉండిలో వైసిపి జెండా ఎగురవేసి టిడిపి కంచుకోటను బద్దలు కొడతామని పివిఎల్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అయితే టిడిపిలో ప్రస్తుత ఎంఎల్ఎ రామరాజు, మాజీ ఎంఎల్ఎ శివరామరాజు ఉండి అసెంబ్లీ సీటు కోసం హోరాహోరీగా తలపడుతున్నప్పటికీ అధిష్టానం ప్రస్తుతం ఎంఎల్ఎ మంతెన రామరాజు వైపే మొగ్గు చూపినట్లు సమాచారం. మాజీ ఎంఎల్ఎ శివరామరాజు నరసాపురం పార్లమెంట్ సభ్యునిగా ఓడిపోయారు. టిడిపి పార్టీ కార్యక్రమాల్లో మూడు సంవత్సరాలపాటు పాల్గొన లేదు. దీంతో నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరాశలో ఉండగా వారికి ఎంఎల్ఎ మంతెన రామరాజు అండగా నిలవడంతో సీటు ఎంఎల్ఎ రామరాజుకు కేటాయించాలని, ఆయన నాయకత్వంలోనే వచ్చే ఎన్నికల్లో ఉండిలో విజయం సాధించి ఉండి గడ్డ టిడిపి అడ్డా అని మరోసారి నిరూపించుకునేందుకు టిడిపి నేతలు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు జనసేన పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా మారింది. టిడిపి, జనసేన ఉమ్మడి పొత్తు కారణంగా ఉండి సీటును టిడిపికే కేటాయించే అవకాశం ఎక్కువగా ఉండడంతో జనసేన నాయకులు తీవ్ర నిరాశ, నిస్పృహల్లో ఉన్నారు. ఒకవేళ ఉండి అసెంబ్లీ సీటులో బిసి అభ్యర్థిని మాత్రం ప్రకటిస్తే జనసేనలో ఇద్దరు అభ్యర్థులు ఆశావాహులుగా ఉన్నారు. వీరిలో జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు గత సంవత్సరం పార్టీలో చేరడం, ఆయన ఎక్కువగా పార్టీలు మారడం అనే అంశాలు ఆయనకు ప్రతికూల అంశాలుగా ఉండొచ్చని జనసేనలో ఒక గ్రూపు అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. మరో అభ్యర్థి చెనమల్ల చంద్రశేఖర్ మాత్రం పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి పార్టీలోనే ఉంటూ నాగరాజు పార్టీలో చేరే వరకూ నియోజకవర్గంలో కార్యక్రమాలు చేసుకుంటూ కరోనా సమయంలో ఎక్కువగా సేవా కార్యక్రమాలు చేసుకుంటూ జనానికి అండగా ఉన్నారని సమాచారం. ఉండి సీటు తనకు కేటాయిస్తే ఉండి నియోజకవర్గంలో జనసేన జెండా ఎగురవేసి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు బహుమతిగా అందిస్తామని చెనమల్ల చంద్రశేఖర్ పలువురితో చర్చించినట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ వైకల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో టిడిపి, జనసేన విఫలం కాగా అదే సమయంలో సిపిఎం ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించడంలో సఫలీకృతమైందనే చెప్పాలి. ఏది ఏమైనప్పటికీ వచ్చే ఎన్నికల్లో ఉండి నియోజకవర్గంలో పోరు ఏకపక్షం కాదని, హోరాహోరీగా ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

గర్భాశయ కేన్సర్‌పై అవగాహనుండాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గర్భాశయ ముఖద్వార కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సదా అన్నారు. మంగళవారం భీమవరంలో సుధ గైనకాలజిస్ట్ హాస్పటల్లో డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భాశయ కేన్సర్‌పై అవగాహన కార్యక్రమంతో పాటు వైద్య పరీక్షలు, వాక్సిన్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సదా మాట్లాడుతూ దేశంలో అత్యధికంగా స్త్రీలు గర్భాశయ ముఖద్వార కేన్సర్ వల్లే మరణిస్తున్నారని తెలిపారు. ఎంత ఎక్కువ అంటే ప్రతి ఎనిమిది నిమిషాలకూ ఒక మహిళ కేన్సర్ వల్ల మరణిస్తోందన్నారు. కేన్సర్ వచ్చిన తరువాత వైద్యం చేయించుకోవడం, కోలుకోవడం ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్న విషయమన్నారు. ముందుగానే వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల దాన్ని నివారించవచ్చని ఆమె అన్నారు.

నేడు వంగవీటి రంగా వర్థంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా ఈ నెల 26వ తేదీ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా కాపు సంక్షేమ సేన శ్రేణులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు చేగొండి హరిరామ జోగయ్య కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గం లోనూ రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

CHANGE OF NAME

I, **CHENNU VENKATA LAKSHMI SATYAVATHI** W/o. Chennu Venkata Ranga, D.No. 17-1-160, Kothapalli vari street, Rusthumbada, Narasapuram, -534275, W.G.Dt. A.P. I have changed my name from **CHINNU VENKATA LAKSHMI SATYAVATHI** (Old name) to **CHENNU VENKATA LAKSHMI SATYAVATHI** (New name) hence forth I am being called **CHENNU VENKATA LAKSHMI SATYAVATHI** W/o. Chennu Venkata Ranga, for all purposes

CHANGE OF NAME

I, **CHENNU VENKATA KRISHNA RAJAJI** S/o. Chennu Venkata Ranga, D.No. 17-1-160, Kothapalli vari street, Rusthumbada, Narasapuram, -534275, W.G.Dt. A.P. I have changed my name from **CHINNU VENKATA KRISHNA RAJAJI** (Old name) to **CHENNU VENKATA KRISHNA RAJAJI** (New name) hence forth I am being called **CHENNU VENKATA KRISHNA RAJAJI** S/o. Chennu Venkata Ranga, for all purposes

CHANGE OF NAME

I, **CHENNU VENKATA RANGA** S/o. Chennu Venkata Reddy, D.No. 17-1-160, Kothapalli vari street, Rusthumbada, Narasapuram, -534275, W.G.Dt. A.P. I have changed my name from **CHINNU VENKATA RANGA** (Old name) to **CHENNU VENKATA RANGA** (New name) hence forth I am being called **CHENNU VENKATA RANGA** S/o. Chennu Venkata Reddy, for all purposes